క్లుప్తంగా

నవోదయ ప్రవేశానికి గడువు పొడిగింపు

రాయవరం: జవహర్ నవోదయ విద్యాలయంలో 9, 11 తరగతుల ప్రవేశ పరీక్షకు దరఖాస్తు గడువు పొడిగించారు. 2024–25 విద్యా సంవత్సరానికి 9, 11 తరగతుల ప్రవేశం కోసం దరఖాస్తు గడువు మంగళవారంతో ముగిసింది. హైదరాబాద్‌లోని నవోదయ విద్యాలయ సమితి ఆదేశాల మేరకు నవంబరు 7 వరకు దరఖాస్తు గడువు పొడిగించారు. ఈ మేరకు పెద్దాపురంలోని జవహర్ నవోదయ ప్రిన్సిపాల్ రామిరెడ్డి మండల విద్యా శాఖ కార్యాలయాలకు సమాచారం అందించారు.

పింఛన్ల పంపిణీలో తొలి స్థానంలో రాయవరం


పింఛను అందజేస్తున్న వలంటీరు

రాయవరం: వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీలో జిల్లాలో రాయవరం మండలం మొదటి స్థానంలో నిలిచింది. నెలలో మొదటి రోజు బుధవారం 80.83 శాతం మందికి పింఛన్లు పంపిణీ పూర్తి చేసి ఈ ఘనత సాధించినట్టు ఎంపీడీఓ కె.నరేంద్రరెడ్డి తెలిపారు. ఉదయాన్నే వలంటీర్లు లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛన్ల పంపిణీ చేశారు. 14 రకాల పెన్షన్ల లబ్ధిదారులు 10,164 మంది ఉండగా, తొలి రోజు 8,216 మందికి పింఛన్లు అందజేశారు. పింఛన్ల రూపేణా రూ.2,75,47,750 మంజూరు కాగా, రూ.2,22,45,500 లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

ఆరోగ్యంపై అవగాహన అవసరం


వృద్ధురాలికి చికిత్సచేస్తున్న డాక్టర్ రత్నకుమారి

కపిలేశ్వరపురం: గ్రామాల్లోని ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన ఉండాలని అంగర పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రత్నకుమారి అన్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా అంగర గ్రంథాలయం వద్ద వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సర్పంచ్ వాసా కోటేశ్వరరావు శిబిరాన్ని సందర్శించారు. వృద్ధులకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులను అందజేశారు.

బహుమతుల అందజేత


విజేతలకు బహుమతులు అందజేసిన ఎస్సై జానీబాషా

కె.గంగవరం: పోలీసు అమర వీరుల సంస్మరణ దినం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖన పోటీల్లో విజేతలైన కె.గంగవరం, పామర్రు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు పామర్రు ఎస్సై జానీబాషా బుధవారం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం పి.వెంకటేశ్వరరావు, ఎంఈఓ నాగరాజు, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక అంశాలపై అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న షైనాజ్

కపిలేశ్వరపురం: వివిధ సామాజిక అంశాలపై కేదారిలంకలో బుధవారం పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామ మహిళా పోలీసు షైనాజ్ విద్యార్థులకు బాల్య వివాహాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, చదువు ప్రాధాన్యం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థి దశలో చదువుపై శ్రద్ధ వహించడం ద్వారా ఉన్నత ప్రమాణాలతో కూడిన జీవితం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

రామచంద్రపురం రూరల్: యూనియన్ బ్యాంకు ద్రాక్షారామశాఖ ఆధ్వర్యంలో ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు బుధవారం చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. విజేతలు మద్దాల రేవతి, కోటిపల్లి ప్రవీణ్, కనికెళ్ల నవ్య, రాజేష్‌కు బ్యాంకు మేనేజర్ ఎస్.ఈశ్వరరావు, అసిస్టెంట్ మేనేజర్ కాశీబాబు బహుమతులు అందజేశారు.

వ్యర్థాలతో డ్రైన్లలో సమస్యలు

రామచంద్రపురం: నిర్లక్ష్యంగా ప్లాస్టిక్ వ్యర్థాలను పారేయడంతో డ్రైన్లు పూడిపోతున్నాయని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ దేవిడ్‌రాజు అన్నారు. పట్టణంలోని అంకంవారి వీధి నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్, పరిసర ప్రాంతాల్లో డ్రైన్లను శుభ్రపరిచేందుకు బుధవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఆయన ఆధ్వర్యంలో శానిటరీ సెక్రటరీ ఉషారాణి పర్యవేక్షణలో పారిశుద్ధ్య కార్మికులు కార్యక్రమాన్ని నిర్వహించారు. డ్రైన్ల వద్ద మొక్కలతో పాటు మేజర్ డ్రైనేజీలో పూడికను తొలగించారు. స్థానిక కౌన్సిలర్ అంకం శ్రీను పరిశీలించారు.

విత్తుకు కసరత్తు

- విత్తన తయారీలో రైతుల నిమగ్నం
- రైత్వారీ విత్తనాలకు తగ్గని గిరాకీ
- వెయ్యి ఎకరాల్లో సాగు


బల్లకట్టు విధానంలో విత్తనాలు తయారు చేస్తున్న రైతులు

రాయవరం: విత్తనాలను తయారు చేసుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. రైతులే స్వయంగా విత్తనాలు తయారు చేసుకునేలా వ్యవసాయ శాఖ ప్రోత్సహిస్తోంది. నకిలీ విత్తనాలతో మోసపోవడం, కొనుగోలు చేసిన విత్తనాల్లో కేళీలు అధికంగా వస్తున్న సందర్భాల్లో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో రైత్వారీ విత్తనాలకు డిమాండ్ పెరగడంతో రైతులు వాటి తయారీకి ప్రాధాన్యమిస్తున్నారు. ఖరీఫ్‌లో వేసిన రబీ విత్తనాల వరి పంట అక్కరకు రావడంతో.. ప్రస్తుతం విత్తన వరి పంటను ఒబ్బిడి చేసుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు.

ఒక శాతం విత్తన వరిసాగు

క్లస్టర్ పరిధిలోని రామచంద్రపురం, కె.గంగవరం, కాజులూరు, రాయవరం, మండపేట, కపిలేశ్వరపురం మండలాల్లో సుమారుగా 1.01 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ వరిసాగును చేపట్టారు. 90 శాతం మేర స్వర్ణ రకాన్ని సాగుచేయగా, మిగిలిన 10 శాతం ఎంటీయూ 3626(బొండాలు), 1318 తదితర రకాలను సాగు చేస్తున్నారు. రబీలో సాగు చేసే వరి రకాలకు సంబంధించి విత్తనాలను ఖరీఫ్‌లోనే సాగు చేస్తారు. మూడు మండలాల్లో సుమారుగా వెయ్యి ఎకరాల్లో విత్తన వరిసాగును చేపట్టారు.

బల్లకట్టుకే ప్రాధాన్యం

రైతులు వరి విత్తనాల తయారీలో బల్లకట్టుకే ప్రాధాన్యమిస్తున్నారు. కోసిన వరి పనలను బల్లపై కొట్టడం ద్వారా విత్తనాలు సేకరిస్తారు. బల్లకట్టు ద్వారా సేకరిస్తే నాణ్యమైన విత్తనాలు వస్తాయి. ట్రాక్టర్ లేదా పశువులతో తొక్కిస్తే విత్తనాల మొలక శాతం తగ్గిపోతుంది. అందుకే రైతులు బల్లకట్టు ద్వారానే విత్తన సేకరణకు ప్రాధాన్యమిస్తున్నారు. అలా సేకరించిన విత్తనాలను రైతులు బాగా ఆరబెట్టిన తర్వాత తమ అవసరాలకు మించి ఉన్న విత్తనాలను విక్రయిస్తారు. బల్లకట్టు కొట్టని రైతులు ట్రాక్టర్‌తో మాసూళ్లు చేయిస్తున్నారు.

పెరుగుతున్న అవగాహన

విత్తన సాగుపై రైతుల్లో అవగాహన పెరుగుతూ వస్తోంది. గతంతో పోల్చుకుంటే విత్తన వరిసాగును రైతులు ఎక్కువగా చేపడుతున్నారు. బయట మార్కెట్‌లో కొనుగోలు చేస్తున్న విత్తనాల్లో ఎక్కువగా కేళీలు రావడం, మొలకశాతం తక్కువగా ఉండడం వంటి కారణాలతో రైతులే వరి విత్తనాల సాగు చేపడుతున్నారు. గతంలో రైతులు ఎక్కువగా వరి పరిశోధన కేంద్రాల్లో తయారు చేసే సీడ్ విత్తనాల కొనుగోలుకే ఎక్కువ ప్రాధాన్యమిచ్చేవారు. ఇటీవల కాలంలో రైతులకు నిర్వహిస్తున్న పొలంబడుల్లో స్వయంగా విత్తనాలు తయారు చేసుకోవాలనే సూచనలు కూడా వారిపై ప్రభావం చూపుతున్నాయి. రైతులు తయారు చేసే వరి విత్తనాలకు గిరాకీ ఎక్కువగా ఉంటోంది. నాణ్యమైన విత్తనాలను రైతుల వద్దే లభించడంతో ధర కూడా అందుబాటులో ఉంటోంది.

నమ్మకం పెరుగుతోంది



రైత్వారీ విత్తనాలకు డిమాండ్ ఉంది. గతంతో పోలిస్తే ఇప్పుడు రైతులు సొంతంగా విత్తన తయారీకే మొగ్గు చూపుతున్నారు. రైతులే విత్తనాలను తయారు చేసుకోవడం వల్ల దీనిపై నమ్మకం పెరుగుతోంది. తెగుళ్లు, పురుగులు ఆశించడం తగ్గుతోంది.

– కొప్పిశెట్టి ప్రభాకర్, మండల వ్యవసాయాధికారి, రాయవరం

ఇంటి వద్దే పేద ప్రజలకు పెన్షన్

మంత్రి వేణుగోపాలకృష్ణ


హౌసింగ్ బోర్డులో ఓ వ్యక్తికి పెన్షన్ అందిస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

రామచంద్రపురం: పేద ప్రజానీకానికి నెల మొదటి రోజే ఇంటి వద్ద పెన్షన్ అందజేయడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పరిపాలన దక్షతకు నిదర్శనమని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. నియోజకవర్గంలో పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం పురపాలక సంఘం పరిధిలోని సచివాలయం–9 హౌసింగ్ బోర్డ్ కాలనీలో ఆయన ప్రారంభించారు. క్షేత్రస్థాయిలో ఏర్పాటు చేసిన పరిపాలన యంత్రాంగం ద్వారా అర్హులైన ప్రతిఒక్కరికీ ఇంటి వద్దే పెన్షన్ అందజేస్తున్నట్టు వివరించారు. తీవ్ర అనారోగ్యానికి గురై పెరాలసిస్‌తో బాధపడుతున్న వ్యక్తికి నేరుగా ఇంటికి వెళ్లి పెన్షన్ అందించినట్టు పేర్కొన్నారు. గతంలో పెన్షన్ ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూసేవారని చెప్పారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ కార్యక్రమాల ద్వారా పేద ప్రజానీకానికి ఎంతో మేలు జరుగుతోందని మంత్రి తెలిపారు. ఆయన వెంట కమిషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డి, స్థానిక కౌన్సిలర్లు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఉన్నారు.

అమరజీవి త్యాగం అజరామరం


రాయవరం మండల పరిషత్ కార్యాలయంలో అమరజీవి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ వెంకటరమణ

రాయవరం: ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములుతో పాటు రాష్ట్రాభివృద్ధికి పాటుపడిన వారిని స్మరించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎంపీపీ నౌడు వెంకటరమణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆంధ్ర రాష్ట్ర అవతరణ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ వెంకటరమణ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ఆత్మార్పణతోనే ప్రత్యేక భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు సాధ్యమైందన్నారు. దేశంలోనే భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు అమరజీవి ఆద్యుడుగా చెప్పడంలో సందేహం లేదన్నారు. తొలుత పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, ఎంపీడీఓ కొవ్వూరి నరేంద్రరెడ్డి, కార్యాలయ ఏఓ డి.శ్రీనివాసు, ఎంఈఓ వై.సూర్యనారాయణ, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. మండలంలోని మండల పరిషత్, ప్రాథమిక, ప్రాథమికోన్నత, జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఆంధ్ర రాష్ట్ర అవతరణ కార్యక్రమాలను హెచ్ఎంలు, ఉపాధ్యాయులు నిర్వహించారు.

ఆర్‌బీకేలో ఏర్పాట్లు పరిశీలించిన జేసీ


సోమేశ్వరంలో ఆర్‌బీకేను సందర్శించి, సిబ్బందికి సూచనలిస్తున్న జేసీ నపూర్‌అజయ్

రాయవరం: మండలంలోని సోమేశ్వరంలో గ్రామ రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.నపూర్‌అజయ్ బుధవారం పరిశీలించారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఏర్పాట్లు, సిబ్బంది వివరాలను ఆమె తెలుసుకున్నారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసే సమయంలో ఇబ్బందులు ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని తహసీల్దారు కేజే ప్రకాష్‌బాబును ఆదేశించారు. మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేసే కేంద్రాల్లో విధులు నిర్వర్తిస్తున్న టెక్నికల్ అసిస్టెంట్లకు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. ఆమె వెంట మండల వ్యవసాయాధికారి కొప్పిశెట్టి ప్రభాకర్, ఎంపీడీఓ కె.నరేంద్రరెడ్డి తదితరులు ఉన్నారు.

సాదాసీదాగా మండల పరిషత్ సమావేశం


మండల పరిషత్ సమావేశంలో నివేదికలను వివరిస్తున్న అధికారులు

కె.గంగవరం: మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం సాదాసీదాగా సాగింది. తొలుత ఆంధ్ర రాష్ట్ర అవతరణను పురస్కరించుకుని పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో శాఖల వారీగా తమ నివేదికలను సభ్యులకు వివరించాలని ఎంపీపీ పంపన నాగమణి అధికారులను ఆదేశించారు. పంచాయతీరాజ్, గృహ నిర్మాణ శాఖ, ఎన్ఆర్ఈజీఎస్ తదితర శాఖల అధికారులు తమ శాఖల తీరుతెన్నులను వివరించారు. కోట పంచాయతీ సర్పంచ్ మల్లిడి వెంకట్రావు తాగునీటి సమస్యపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈని నిలదీశారు. మండలంలోని కె.గంగవరం, తామరపల్లి, ఉడిమూడి, సుందరపల్లి గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తమ గ్రామాలకు పూర్తి స్థాయిలో తాగు నీరందడం లేదని సమావేశం దృష్టికి తెచ్చారు. మార్కెట్ కమిటీ చైర్మన్ పండ గోవిందరాజు, డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీలు దూడల నాగేశ్వరరావు, నీతిపూడి మధుబాల, ఎంపీడీఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ వైద్యనాథ్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ జిల్లా సభలు విజయవంతం చేయాలి


ర్యాలీని ప్రారంభిస్తున్న గోపాలకృష్ణారెడ్డి

మండపేట: అంగన్‌వాడీ జిల్లా మహాసభలు ఈ నెల 3, 4 తేదీల్లో మండపేటలో జరుగుతాయని, సభలను విజయవంతం చేయాలని యూటీఎఫ్ జిల్లా నేత కె.గోపాల కృష్ణారెడ్డి కోరారు. మండపేటలో బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మోటార్ సైకిల్ ర్యాలీని ప్రారంభించారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు కె.కృష్ణవేణి మాట్లాడుతూ 3న మధ్యాహ్నం మండపేట బస్టాండు నుంచి కలువపువ్వు సెంటర్ వరకు ప్రదర్శన, అనంతరం మున్సిపల్ కార్యాలయం ఎదురుగా రోడ్డులో బహిరంగ సభ జరుగుతుందని పేర్కొన్నారు. సభకు ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు, సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ హాజరవుతారని చెప్పారు. అదే రోజు సాయంత్రం ఆరు గంటలకు, 4న బాబు అండ్ బాబు కన్వెన్షన్‌లో ప్రతినిధుల సభ జరుగుతుందని తెలిపారు. ర్యాలీలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కొబ్బరిచెట్టు మీదపడి వ్యక్తి మృతి

కపిలేశ్వరపురం: మండలంలోని కేదారిలంకలో బీరతోట పనిచేస్తున్న రైతు యర్రంశెట్టి కృష్ణ (50)పై కొబ్బరిచెట్టు విరిగిపడటంతో మృతి చెందాడు. బుధవారం జరిగిన ఘటనపై అంగర ఎస్సై జి.చంటి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శిథిల స్థితికి చేరిన కొబ్బరిచెట్టు గాలికి విరిగిపోవడంతో ప్రమాదం సంభవించింది. స్థానికులు కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు.

‘కంచి’ హత్య కేసు మిస్టరీ వీడేనా?

గత నెల 21న వెదురుపాకలో ఘటన

రాయవరం: మండలంలోని వెదురుపాకలో గత నెల 20న జరిగిన హత్య కేసు మిస్టరీ నేటికీ వీడలేదు. వెదురుపాకకు చెందిన పాల వ్యాపారం చేసే కంచి వెంకటరమణ(38) హత్యకు గురైన విషయం పాఠకులకు విదితమే. పాలకేంద్రం వద్ద వ్యాపారం ముగించుకుని ఇంటికి చేరుకోని వెంకటరమణ ఉదయానికి మృతదేహమై పడి ఉన్న విషయం స్థానికంగా సంచలనం రేగిన విషయం విదితమే. వెదురుపాక నుంచి ఆరికరేవుల వెళ్లే దారిలో వెంకటరమణ పంట బోదెలో మృతదేహం పడి ఉండగా, మృతదేహం సమీపంలో క్షుద్రపూజలు చేసిన ఆనవాళ్లు ఉండడం స్థానికంగా అలజడి రేపింది. ఈ ఘటనపై పోలీసులు పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. వెంకటరమణ తలపై బలమైన గాయం ఉండడంతో వెంకటరమణను హత్య చేసి కాలువలో పడవేసి ఉంటారన్న అనుమానాలు స్థానికంగా వ్యక్తమయ్యాయి. రామచంద్రపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ నేతృత్వంలో పోలీసులు పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. హత్య జరిగి 10 రోజులైనా హత్య కేసు మిస్టరీ వీడలేదు. అయితే ఈ కేసులో ప్రధాన నిందితుడు కోసం పోలీసులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. వెంటకరమణకు తెలిసిన వ్యక్తే ఈ హత్యలో ప్రధాన పాత్ర పోషించినట్లుగా సమాచారం. ఇద్దరు లేదా ముగ్గురు ఈ హత్యలో పాల్గొని ఉంటారనే వాదన విన్పిస్తోంది. ఈ హత్య కేసును పోలీసులు సవాల్‌గా తీసుకుని చేస్తున్న దర్యాప్తు నేపథ్యంలో ఒకటి రెండు రోజుల్లో నిందితులను అరెస్ట్ చూపించే అవకాశమున్నట్లు సమాచారం.

సీఎం జగన్ పాలనలో పారదర్శకత

గడప గడపకూ మన ప్రభుత్వంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు


స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, కర్రి పాపారాయుడు

మండపేట: అవినీతి, అక్రమాలకు తావులేకుండా.. అర్హత కలిగిన ప్రతిఒక్కరి చెంతకు సంక్షేమ పథకాలు చేరవేస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శకమైన పాలన అందిస్తున్నారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ ఈతకోట కిన్నెర, ఉప సర్పంచ్ తులా శేషారావు ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మెల్సీ తోట ద్వారపూడిలో పర్యటించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు, వైస్ చైర్మన్ చిక్కాల శ్రీనివాసరావు, సొసైటీ చైర్మన్ తులా శ్రీరంగారావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు దంతులూరి శ్రీరామవర్మ తదితరులతో కలిసి పాత పశువులసంత మార్కెట్ ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి స్థానికుల యోగక్షేమాలు తెలుసుకున్నారు. స్థానికులు చెప్పిన సమస్యలపై ఎంపీడీఓ ఐ రాజు, పంచాయతీ అధికారులతో మాట్లాడి, పరిష్కార చర్యలు తీసుకున్నారు. అనంతరం ఎమ్మెల్సీ తోట మీడియాతో మాట్లాడుతూ టీడీపీ పాలనలో పనుల కోసం నాయకులు, అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేదన్నారు. ముడుపులు చెల్లిస్తేనే కానీ పథకాలు అందని దుస్థితి ఉండేదన్నారు. సీఎం జగన్ వచ్చాక ఎటువంటి అవినీతికి తావులేకుండా, వలంటీర్లు తలుపుతట్టి ప్రభుత్వ పథకాలను అందజేస్తున్నారని పేర్కొన్నారు. జెడ్పీటీసీ కుడిపూడి భవాని, ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, మండల సేవాదళ్ కన్వీనర్ పోతుల రాంబాబు, పార్టీ నాయకులు యరగతపు విజయ్, సంగిశెట్టి రమేష్, సత్తి సత్తిబాబు, పోతుల దుర్గాప్రసాద్, పాలినాటి సత్యనారాయణ, దండుబోయిన సూర్యనారాయణమూర్తి, నామాల వెంకన్న, పుట్టపూడి సత్తిబాబు, సత్తి రాంబాబు, నామాల శ్రీనివాసరావు, తొంటాపు సత్తిపండు, గూదూరి సుబ్బరాజు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం, దుప్పట్ల పంపిణీ


అన్నపూర్ణమ్మ ఆలయం వద్ద పేదలకు అన్నదానం చేస్తున్న రాజుబాబు

మండపేట: వైఎస్సార్ సీపీ యువజన విభాగం నేత చోడే శ్రీకృష్ణ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన అభిమానులు, పార్టీ నాయకులు బుధవారం పెద్దఎత్తున సేవా కార్యక్రమాలు చేశారు. పార్టీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజుబాబు కార్యాలయం వద్ద శ్రీకృష్ణ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాజుబాబు చేతుల మీదుగా 200 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. పార్టీ నాయకుల ఆధ్వర్యంలో అన్నపూర్ణమ్మ ఆలయం వద్ద పూజలు నిర్వహించి, 150 మందికి అన్నదానం, దుప్పట్లు పంపిణీ చేశారు. ఆదర్శ హెల్పింగ్ హేండ్స్ సంస్థ వద్ద వంద మంది పేదలకు అన్నదానం చేసి, దుప్పట్లు అందజేశారు. ఏడో వార్డులో బాపూజీ స్కూల్ వద్ద హరీష్ ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులు 50 మంది పేదలకు ఐదు కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో సొసైటీ చైర్మన్ పెంకే గంగాధర్, మండపేట శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు పంపన శ్రీనివాస్, పార్టీ నాయకులు సూరంపూడి సత్యప్రసాద్, కొవ్వాడ అప్పన్నబాబు, దుగ్గిరాల రాంబాబు, ముక్కా దాలయ్య, దాసరి సత్యనారాయణ, లేగా వెంకన్న, యర్రా సుబ్రహ్మణ్యం, రగడ, మల్లేశ్వరావు, పిఠాపురం సత్యనారాయణ, నిమ్మలపూడి విరాట్‌రాజు, పార్టీ డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా డాక్టర్స్ సెల్ కన్వీనర్ సత్యకృష్ణ, శ్రీకృష్ణ ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులు పాల్గొన్నారు.

తెరచుకున్న ఎంపీఎస్ స్కూల్

- హాజరైన విద్యార్థులు, ఉపాధ్యాయులు
- దగ్గరుండి పర్యవేక్షించిన గవర్నింగ్ బాడీ
- నేటి నుంచి పూర్తి స్థాయిలో పిల్లల హాజరుకు చర్యలు


ఎంపీఎస్ స్కూల్‌లో పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయురాలు

మండపేట: భాగస్వాముల మధ్య నెలకొన్న వివాదంతో ఆరు రోజులుగా మూతపడిన పట్టణంలోని ఎంపీఎస్ స్కూల్ బుధవారం తెరుచుకుంది. కలెక్టర్ ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన గవర్నింగ్ బాడీ దగ్గరుండి స్కూల్ నిర్వహణ పర్యవేక్షించింది. మొత్తం 1,430 మందిలో 472 మంది విద్యార్థులు హాజరు కాగా, గురువారం నుంచి పూర్తి స్థాయిలో విద్యార్థుల హాజరుకు అధికారులు చర్యలు తీసుకున్నారు.

యాజమాన్య హక్కు విషయమై భాగస్వాముల మధ్య నెలకొన్న వివాదంతో దసరా సెలవులు ముగిసినా మండపేట పబ్లిక్ స్కూల్ (ఎంపీఎస్) ఆరు రోజులుగా తెరుచుకోని విషయం విదితమే. పరస్పర ఫిర్యాదుల మేరకు ఇరువర్గాల వారిపై పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. విద్యార్థులు నష్టపోరాదన్న ఉద్దేశంతో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు చొరవ తీసుకుని కలెక్టర్ హిమాన్షు శుక్లాతో మాట్లాడి, 28న పాఠశాల తెరిపించినప్పటికీ స్కూల్ నిర్వహణ జరగలేదు. ఈ విషయమై డీఈఓ కమలకుమారి విచారణ చేయగా, సెలవుల నేపథ్యంలో స్కూల్‌ను శుభ్రం చేసి సోమవారం నుంచి తెరుస్తామని సిబ్బంది విద్యార్థుల తల్లిదండ్రులకు మెసేజ్‌లు పెట్టినట్టు ఆమె దృష్టికి వచ్చింది. స్కూల్ వివాదాన్ని విపక్షాలు రాజకీయం చేసి లబ్ధి పొందాలని చూడటం విమర్శలకు తావిచ్చింది. వివాదం పెంచేందుకు విపక్షాలు చేస్తున్న ప్రయత్నాలపై ఎమ్మెల్సీ తోట ధీటుగా స్పందించారు. భాగస్వాముల సమస్యను పరిష్కరించేందుకు వారి సొంత సామాజిక వర్గానికి చెందిన ప్రముఖులతో చేసిన ప్రయత్నాలను మంగళవారం వారి మాటల్లోనే మీడియా సమావేశంలో చెప్పించి విపక్ష నేతల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టారు. తల్లిదండ్రులు, ప్రజలకు వాస్తవాలు తెలియజేసి విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుతోంది ఎవరో తెలుసుకోవాలని విపక్షాల నోళ్లు మూయించారు. మీడియా ముందే కలెక్టర్‌తో మాట్లాడి బుధవారం నుంచి స్కూల్ తెరిచేందుకు చర్యలు తీసుకున్నారు.


స్కూల్ నిర్వహణను పర్యవేక్షిస్తున్న గవర్నింగ్ బాడీ

సొసైటీతో ప్రమేయం లేకుండా..

ప్రస్తుత స్కూల్ సొసైటీతో ప్రమేయం లేకుండా, స్కూల్ నిర్వహణకు ఆర్డీఓ సుధాసాగర్ ప్రెసిడెంట్‌గా, ఎంపీడీఓ ఐ రాజు, డీవైఈఓ ఎస్ఎల్ నరసింహఫణి, జిల్లా ఆడిట్ ఆఫీసర్ ఏవీవీ సత్యనారాయణ, జిల్లా కోఆపరేటివ్ ఆఫీసర్ ఎ.రాధాకృష్ణ సభ్యులుగా ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తూ మంగళవారం కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారు. ఉదయాన్నే గవర్నింగ్ బాడీ స్కూల్‌కు చేరుకుని నిర్వహణను పర్యవేక్షించింది. కాగా 430 మంది విద్యార్థులు, ఇద్దరు మినహా 82 మంది సిబ్బంది హాజరైనట్టు అధికారులు తెలిపారు. విద్యార్థులు వచ్చే గ్రామాలకు బస్సులు నడిపారు. గురువారం నుంచి పూర్తిస్థాయిలో విద్యార్థులు హాజరయ్యేందుకు చర్యలు తీసుకున్నట్టు కమిటీ అధ్యక్షుడు, ఆర్డీఓ సుధాసాగర్ తెలిపారు. ఎంఈఓ ఎస్ రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

రాయవరం: రాయవరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఎంపీడీఓ కె.నరేంద్రరెడ్డి బుధవారం విలేకరులకు తెలిపారు. ఎంపీపీ నౌడు వెంకటరమణ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు తమ విభాగాల పూర్తి సమాచారంతో హాజరుకావాలని ఎంపీడీఓ సూచించారు.

పరిశుభ్రత అందరి బాధ్యత

కాజులూరు: గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణకు ప్రతిఒక్కరూ బాధ్యత వహించాలని గొల్లపాలెం సర్పంచ్ పోతురాజు ప్రసన్న మౌనిక అన్నారు. ‘స్వచ్ఛత మన బాధ్యత’ కార్యక్రమంలో భాగంగా పంచాయతీ కార్యదర్శి చెల్లుబోయిన వేణుగోపాలరావు ఆధ్వర్యంలో సిబ్బంది బుధవారం గ్రామంలో వీధులను శుభ్రం చేశారు. డ్రైనేజీల్లో ట్యాంకర్ల ద్వారా హైపోక్లోరైడ్ ద్రావణాన్ని పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ అపరిశుభ్ర వాతావరణమే అంటువ్యాధులు ప్రబలేందుకు కారణమన్నారు. గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపర్చడంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోందని తెలిపారు.

చురుగ్గా డ్రైన్ నిర్మాణ పనులు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మండాలమ్మపేటలో ‘గడప గడపకూ’లో మంజూరైన నిధులతో నిర్మిస్తున్న సీసీ డ్రైన్ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఏళ్లనాటి సమస్యను పరిష్కారమవుతోందని స్థానికులు రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు. నిర్మాణ పనులను సర్పంచ్ కొత్తపల్లి అరుణ బుధవారం పరిశీలించారు.

అమరజీవి పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి


పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ కీర్తి స్పందన తదితరులు

రామచంద్రపురం రూరల్: ఆంధ్ర రాష్ట్ర అవతరణను పురస్కరించుకుని రామచంద్రపురం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములుకు ఎంపీడీఓ ఎస్.కీర్తిస్పందన ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో కార్యాలయ ఏఓ సీహెచ్‌వీఏ రామసుబ్రహ్మణ్యం, సీనియర్ అసిస్టెంట్ లాజర్, జూనియర్ అసిస్టెంట్ అరుణ్‌సాయి, టైపిస్ట్ దిలీప్ విశ్వనాథ్, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ


లొల్లలో ఆలయ నిర్మాణ భూమిపూజలో పాల్గొన్న పృథ్వీరాజ్, ఇతర నాయకులు

రాయవరం: లొల్ల గ్రామంలో శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ నిర్మాణ పనులకు బుధవారం వైఎస్సార్ సీపీ యువనేత తోట పృథ్వీరాజ్ భూమిపూజ చేశారు. ఇప్పుడున్న ఆలయం జీర్ణదశకు చేరడంతో, ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు రూ.10 లక్షలు దేవాదాయ శాఖ నుంచి మంజూరు చేయించారు. ఆలయ నిర్మాణ పనులకు నిర్వహించిన పూజల్లో తాళాబత్తుల భద్రరావు, ఈశ్వరమ్మ, దార్ల ప్రసాద్, వాసాబత్తుల సుబ్బారావు, సత్తిలింగం దంపతులు పీఠాలపై కూర్చుని పూజాదికాలు చేశారు. పృథ్వీరాజ్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హిందూ దేవాలయాల అభివృద్ధికి ఇతోధికంగా కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, సర్పంచ్ చాట్రాతి జానకిరాంబాబు, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ చేవా సత్యనారాయణ, వేణుగోపాలస్వామి ఆలయ చైర్మన్ గుండపనీడి వీర్రాజు, వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ కమిటీ చైర్మన్ తాళాబత్తుల వీరవెంకటప్రసాద్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.